విజయనగరం
శుక్రవారం । 24 । నవంబర్ । 2023



పటిష్ట పర్యవేక్షణలో ప్రాథమిక విద్య

ఉన్నత పాఠశాలల్లో ఫలితాలు మెరుగుపడాలంటే ప్రాథమిక విద్య నుంచి బోధనలో నాణ్యత పెరగాలని జిల్లా విద్యాశాఖ గుర్తించింది. - 8లో



అగ్ని ప్రమాద బాధితులకు నష్టపరిహారం పంపిణీ

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో బోట్లు నష్టపోయిన వారికి పరిహారం పంపిణీ చేశారు. - 8లో



గౌరమ్మకు సారె

కొత్తవలస: మంగళపాలెం గ్రామస్తులు గౌరీనందీశ్వరులకు గురువారం భారీ సారె సమర్పించారు. 300 మంది మహిళలు 20 రకాల స్వీట్లు, 10 రకాల పండ్లను ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పించారు.

న్యూస్‌రీల్

భూ సర్వే అ'ద్వితీయ'ం



సచివాలయ సర్వేయర్లతో మాట్లాడుతున్న ఏడీ త్రివిక్రమరావు

కొత్తవలస: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం కింద జిల్లాలో భూముల రీ సర్వే శరవేగంగా సాగుతోందని, రాష్ట్రస్థాయిలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచినట్టు సర్వేశాఖ ఏడీ టి.త్రివిక్రమరావు తెలిపారు. మండలంలో సాగుతున్న సర్వేపై సచివాలయ సర్వేయర్లతో కొత్తవలస తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. సర్వేను పక్కాగా నిర్వహించి హద్దురాళ్లు ఏర్పాటుచేయాలని సూచించారు. ఫేజ్–1లో 179 రెవెన్యూ గ్రామాలు, ఫేజ్–2లో 178 గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. ఫేజ్–3లోని 160 గ్రామాల్లో ప్రస్తుతం సర్వే సాగుతున్నట్టు వెల్లడించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు 'ఆదర్శ' విద్యార్థి



గుణవర్ధన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణరావు, ఉపాధ్యాయులు

గంట్యాడ: మండలంలోని ఆదర్శ పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతున్న జుత్తాడ గుణవర్ధన్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు అర్హత సాధించాడు. విజయవాడలో ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 కబడ్డీ బాలుర విభాగం పోటీల్లో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణారావు, పీడీ రాధ, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

హైరిస్క్ ఉన్నవారికి హెపటైటిస్–బి వ్యాక్సిన్

- జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రాణి



హెపటైటిస్–బి వ్యాక్సిన్ శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రాణి

విజయనగరం ఫోర్ట్: హైరిస్క్ గ్రూపులకు హెపటైటిస్–బి వ్యాక్సిన్ వేయించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె. రాణి తెలిపారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంలో హైరిస్క్ గ్రూప్స్ (హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సోకే అవకాశం ఉన్న సమూహాలు)లకు చెందిన మహిళలు, స్వలింగ సంపర్కులు, ట్రాన్స్‌జెండర్లకు హెపటైటిస్–బి, సి పరీక్షలు గురువారం నిర్వహించారు. అనంతరం వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ ఆదిత్యవర్మ, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ ఉపేంద్రరావు పాల్గొన్నారు.

మహిళా కబడ్డీ జట్టుకు 18 మంది ఎంపిక



మహిళా కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సీనియర్స్ మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సిటీక్లబ్ ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు హాజరుకాగా.. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 18 మంది క్రీడాకారులను జిల్లా ప్రాబబుల్స్ జట్టుకు ఎంపిక చేశారు. వీరికి కోచింగ్ క్యాంప్ నిర్వహించిన అనంతరం తుదిజట్టును ఎంపిక చేస్తామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కె.వి.ప్రభావతి తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కర్నూలు జిల్లా గోనెగండ్లలో జరగనున్న 70వ అంతర్ జిల్లాల మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపిక పోటీలను అసోసియేషన్ ప్రతినిధులు రంగారావుదొర, నడిపేన లక్ష్మణరావు, సూర్యనారాయణ, కె.గోపాల్, నగేష్ తదితరులు పర్యవేక్షించారు.

- మంత్రుల బృందానికి బైక్ ర్యాలీతో స్వాగతం
- అలరించిన నృత్య ప్రదర్శనలు
- బొబ్బిలిలో నిర్వహించిన సామాజిక సాధికార సభకు పోటెత్తిన జనం
- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే మేలు జరిగిందంటూ నినాదాలు
- సామాన్యులకు రాజ్యాధికారం వచ్చిందంటూ కేరింతలు
- దిగ్విజయమైన బొబ్బిలి సామాజిక సాధికార బస్సు యాత్ర



బస్సుయాత్రకు బైక్ ర్యాలీతో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు

బొబ్బిలిలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర సభకు పోటెత్తిన జనం



బొబ్బిలిలో వెల్లివిరిసిన సామాజిక చైతన్యం



సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: జనారణ్యమా? జనసంద్రమా?? నేల ఈనిందా! పుడమితల్లి ఇంతమందిని మోసిందా? అన్నంతగా జనం. గతంలో పెద్దలకు మాత్రమే ఉన్న అధికారం నేడు సామాన్యుడి చెంతకు రావడంతో బొబ్బిలి వాసుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. వెనుకబడిన వర్గాలకు జరిగిన మేలును వివరించేందుకు సామాజిక సాధికార యాత్రగా గురువారం బొబ్బిలి వచ్చిన మంత్రుల బృందానికి జేజేలు పలికారు. నృత్యప్రదర్శనలతో స్వాగతం పలికారు. జై జగన్ అంటూ నినదించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఆర్థికోన్నతి చెందాయంటూ సంతోషించారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం సాగిస్తున్న సంక్షేమ పాలనను సామాజిక వర్గాల పెద్దలు, మంత్రులు వివరిస్తుంటే చప్పట్లతో మద్దతుతెలిపారు. బొబ్బిలి శ్రీ కళాభారతి రోడ్డుపై సాగిన సామాజిక సాధికార సభను దిగ్విజయం చేశారు.

రామభద్రపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు సామాజిక సాధికార బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిల్లా ప్రజలకు, జిల్లాకు చేసిన మేలును తెలియజేశారు. అక్కడి నుంచి బొబ్బిలి శ్రీకళాభారతి వద్ద నిర్వహించే బహిరంగ సభకు వచ్చే మంత్రుల బృందంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, రైతులు రామభద్రపురం నుంచి సుమారు 500 బైక్‌లతో మహా ర్యాలీగా సాగారు. మధ్యలో బొబ్బిలి మండలం మెట్ట వలస వద్ద రూ.కోటి 12లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ సముదాయాన్ని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు ప్రారంభించారు. అక్కడి నుంచి గ్రోత్ సెంటర్ వద్ద భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఆ సమయంలో బొబ్బిలి మహిలలు నేతలపై పూలవర్షం కురిపించారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సభలో వెనుకబడిన వర్గాలకు, బొబ్బిలి నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మేలును ఒక్కొక్కటిగా వివరించారు. సభ ప్రారంభానికి ముందు వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో కళాకారులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, అలజంగిజోగారావు, ఎమ్మెల్సీ డాక్టర్ పి సురేష్‌బాబు, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ శోభ స్వాతిరాణి, మాజీ ఎమ్మెల్యే హైమావతి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డీసీసీబీ చైర్మన్ వి.చినరామినాయుడు, టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ భావన, మాజీ ఎమ్మెల్సీశ్రీనివాసులనాయుడు, దాసరికార్పొరేషన్ చైర్‌పర్సన్ రమాదేవి, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి గోపాలరావు, పట్టణ అధ్యక్షుడు రమేష్ నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు శంబంగివేణుగోపాల నాయుడు, యువ నాయకుడు శంబంగి శ్రీకాంత్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, పార్టీ మండలాధ్యక్షులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



బొబ్బిలి రోడ్డులో అభిమానుల కేరింత

నీ కోట దగ్గరే మాట్లాడుతున్నా! వినపడుతోందిగా!!



ఐదేళ్ల మున్సిపల్ చైర్మన్ హోదాలో బేబీ నాయన ఐదు సార్లు మాత్రమే మీటింగ్‌లకు వెళ్లాడంటే దానికి కారణం సభ్యుల సమస్యలకు సమాధానం చెప్పలేక ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లిపోవడమే కారణం. మూడు సార్లు అవకాశమిచ్చిన ప్రజల అభిమానాన్ని తమ ఆస్తులు కాపాడుకోవడానికి, హోదాకు తాకట్టు పెట్టారు ఈ రాజులు! చంద్రబాబు హయాంలో తొమ్మిదింటిలో ఐదు అసెంబ్లీ స్థానాలకు ఓసీలను నిలబెట్టి బీసీలను అణగదొక్కారు. అందుకే గత ఎన్నికల్లో తొమ్మిదికి తొమ్మిది స్థానాలూ టీడీపీని మట్టికరిపించి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ప్రజలు గెలిపించారు. వచ్చే ఎన్నికల్లోనూ అదే పునరావృతమవుతుంది.

– శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బొబ్బిలి ఎమ్మెల్యే

వైఎస్సార్ సీపీతోనే మేలు



బొబ్బిలిలో రెవెన్యూ డివిజన్‌ను తెస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పుకొచ్చిన చంద్రబాబు ఏనాడైనా రెవెన్యూ డివిజన్ ఊసెత్తారా? ప్రభుత్వం ఏర్పాటయ్యాక బొబ్బిలికి రెవెన్యూ డివిజన్ మంజూరు చేసి వెంటనే ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిదే! మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి కోసం పార్టీని వదిలి వెళ్లిపోయిన రాజుల సంగతి ప్రజలందరికీ తెల్సిందే! ఎన్‌సీఎస్ సుగర్స్‌కు చెరకు తరలించిన రైతులకు బకాయిలు ఇవ్వకపోతే దాని ముక్కుపిండి వసూలు చేసిన పార్టీ వైఎస్సార్ సీపీ అయితే యాజమాన్యం కొమ్ము కాసినది టీడీపీ. విశాఖరాజధాని సాకారం కానున్నది జగన్‌తోనే! వైద్య కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీది! దొంగలు వస్తున్నారు జాగ్రత్త!

– మజ్జిశ్రీనివాసరావు, జెడ్పీచైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

రాజకీయ చైతన్యం



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారిని ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, చైర్మన్లుగా చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే. ముఖ్యమంత్రిది సామాజిక సాధికార ధోరణి. అందుకే ఆయనకు మద్దతు పలికిన నాయకులకు, ప్రజలకు న్యాయం జరిగింది. దేశంలోనే లేని ఎన్నో పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డిదే.

– కంబాల జోగులు, ఎమ్మెల్యే, రాజాం

దేశం మెచ్చే 'సంక్షేమం'



సంక్షేమ పథకాల అమలులో దేశం దృష్టిని ఆకర్షించిన నాయకుడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి. ఆయన సుపరిపాలనలో విద్య, వైద్య, తాగునీటి, సాగునీటి రంగాలు ముందంజలో ఉన్నాయి. లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధి జమవుతోంది. మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం.

– బెల్లాన చంద్రశేఖర్, ఎంపీ, విజయనగరం

ఏ గడపకైనా వచ్చే దమ్ముందా?




మన జిల్లాలోనే కాదు. రాష్ట్రంలోని ఏ గడపకైనా వెళ్లి వైఎస్సార్ సీపీ హయాంలో ప్రజలకు మేలు జరిగిందా? లేక టీడీపీ హయాంలో జరిగిందా అని అడుగుదాం. టీడీపీ నాయకులకు ఇదే సవాల్! ఆయా గడపలకు వచ్చే దమ్ముందా? దళితులకు రూ.75వేల కోట్లు, గిరిజనులకు రూ.25వేల కోట్ల ఆర్థిక ప్రయోజనం కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీదే. కరోనా వంటి కష్టాలొచ్చినప్పుడు ప్రజల్లో లేకుండా ఇప్పుడు ఎన్నికలొస్తున్నాయని ప్రజల ముందుకు వస్తే నమ్మే ప్రజల్లేరిప్పుడు. వచ్చినా 2014లో ఇచ్చిన మేనిఫెస్టో ఎంత వరకూ అమలు చేశారని టీడీపీ నాయకులను నిలదీయండి. టీడీపీ వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టోను ఎందుకు తొలగించారో ప్రశ్నించండి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిందని గట్టిగా చెప్పండి.

– పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్యే, కురుపాం



అన్ని వర్గాల్లోనూ సామాజిక సాధికారత



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి హయాంలో స్థానికంగానే సామాజిక సాధికారత చూపలేదు. రాష్ట్ర మంత్రి వర్గంలో 25 మందికి 17 మందిని స్థానిక సామాజిక వర్గాలకే ప్రాధాన్యం కల్పించారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి చరిత్ర సృష్టించిన సీఎం కేవలం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే. రైతులు, మహిళలు, ఇతర వర్గాలకు అవసరమయిన సంక్షేమ పథకాలను ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే. చంద్రబాబుది మోసపూరిత హామీలే కాకుండా పరిపాలన కూడా మోసపూరితమే. వై.ఎస్.జగన్‌ది నమ్మకమయిన పరిపాలన. వచ్చే ఎన్నికల్లో చాలా జాగ్రత్తగా ఉండాలి. వైఎస్సార్‌సీపీకి మీ మద్దతు కొనసాగాలి.

– బూడి ముత్యాల నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి

---

500 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు

- సోమలింగాపురంలో ధాన్యంకొనుగోలు కేంద్రం ప్రారంభం
- 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు
- వెల్లడించిన జేసీ, జెడ్పీచైర్మన్



ధాన్యం బస్తాను తూకంవేసి సోమలింగాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ చంద్రశేఖర్ తదితరులు

మెరకముడిదాం: జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 500 కొనుగోలు కేంద్రాల ద్వారా 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది లక్ష్యంగా నిర్దేశించినట్టు జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ బెల్లానచంద్రశేఖర్, జేసీ మయూర్ అశోక్ వెల్లడించారు. మెరకముడదాం మండలం సోమలింగాపురంలో జిల్లాస్థాయి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం క్వింటా ఎ–గ్రేడ్ ధాన్యానికి – 2,203, సాధారణ రకం–2,183 మద్దతు ధర నిర్ణయించిందన్నారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో రైతులు వ్యక్తిగత ఖాతాలకు డబ్బులు జమవుతాయన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించేందుకు అవసరమైన గోనెలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందని తెలిపారు. రైతులు సొంత గోనెల్లో తెస్తే 40 కిలోలు గోనెకు రూ.3.39 పైసలు చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, కె.వి.సూర్యనారాయణరాజు, తాడ్డివేణుగోపాలరావు, కె.విశ్వేశ్వరరావు, ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, వైస్ ఎంపీపీ టి.హరిబాబు, పి.కృష్ణమూర్తి, సర్పంచ్ ఎ.అప్పారావు, ఎంపీటీసీ ఎస్.సీతారామ రాజు, ఎస్.కృష్ణమూర్తిరాజు, పౌరసరఫరాలశాఖ డీఎం మీనాకుమారి, వ్యవసాయశాఖ జేడీ రామారావు, డీసీఓ రమేష్, ఎంపీడీఓ ఎం.రత్నం, తహసీల్దార్ విజయభాస్కర్, ఏఓ శ్రావణితేజ పాల్గొన్నారు.

478 మందికి రూ.2.8కోట్ల లబ్ధి

- వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా నిధులను విడుదల చేసిన సీఎం
- సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ నాగలక్ష్మి



లబ్ధిదారులకు వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకం కింద జిల్లాలోని 478 మంది నవ వధువులకు రూ.2 కోట్ల79 లక్షల 90 వేల ఆర్థిక ప్రయోజనం కలిగింది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహనరెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో గురువారం నిధులు విడుదల చేశారు. దీనికి సంబంధించిన చెక్కును కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ముస్లింలు, కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఈ ఏడాది నాలుగో విడత కింద ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించినట్టు తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు జిల్లాలో 2,794 మందికి రూ.16.46 కోట్ల మేర లబ్ధిచేకూరిందని తెలిపారు. ప్రస్తుత లబ్ధిదారుల్లో బీసీలు 413 మంది, ఎస్సీ–49, ఎస్టీలు 8, దివ్యాంగులు 8 మంది ఉన్నారన్నారు. వీరిలో కులాంతర వివాహాలు చేసుకున్న వారు 17 మందికాగా దివ్యాంగులను వివాహం చేసుకున్నవారు 8 మంది ఉన్నారన్నారు. ఎస్సీలకు రూ.లక్ష, ఎస్సీ కులాంతర వివాహాలకు రూ.1.20 లక్షలు, ఎస్టీలకు రూ.లక్ష, ఎస్టీ కులాంతర వివాహాలకు రూ.1.20లక్షలు, బీసీలకు రూ.50 వేలు, బీసీ కులాంతర వివాహాలకు రూ.75 వేలు, చొప్పున వివాహ ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్టు వెల్లడించారు. వధువుకు 19 ఏళ్లు, వరుడికి 21 ఏళ్లు నిండి ఉండాలని, వారిద్దరూ కనీసం పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కొత్తగా వివాహమైన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పథకం వర్తిస్తుందని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి తెలిపారు. ఏటా నాలుగు విడతలుగా మూడు నెలలకోసారి ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం విడుదల చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి రామానందం, గిరిజన సంక్షేమాధికారి చంద్రశేఖర్, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రొంతు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర పరిశీలకుడిగా అజయ్‌కుమార్


పి.అజయ్‌కుమార్

రాజాం సిటీ: ఈ నెల 24 నుంచి 26 వరకు శ్రీకాకుళం జిల్లా కేశవరావుపేటలో జరగనున్న బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు రాష్ట్ర పరిశీలకుడిగా ఎంపికయ్యానని పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ పి.అజయ్‌కుమార్ తెలిపారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17, 19 రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయన్నారు. ఈ మేరకు గురువారం కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు అందాయని తెలిపారు. ఆయన ఎంపికపట్ల హెచ్ఎం శాసపు సత్యనారాయణ, బాల్‌బ్యాడ్మింటన్ సంఘం జిల్లా అధ్యక్షుడు కోత పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శి పీవీజీకే రాజు, కోశాధికారి బీహెచ్ అరుణ్‌కుమార్‌లతోపాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ డ్యాన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


మున్నా మైఖేల్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల

విజయనగరం: అంతర్జాతీయ స్థాయి డ్యాన్స్ పోటీల్లో నగరానికి చెందిన మున్నా మైఖేల్ డ్యాన్స్ అకాడమీ మూడోస్థానంలో నిలవడం ఆనందంగా ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కోలగట్ల తన స్వగృహంలో అకాడమీ విజేతలైన వంశికా సింగ్, దర్శన్ సురానా, ప్రదీప్ కుమార్‌లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ మున్నా మాట్లాడుతూ ఐఐజీఎఫ్ 2023 డ్యాన్స్ పోటీలు ఈ నెల 18, 19 తేదీల్లో శ్రీలంకలో జరిగాయన్నారు. అంతర్జాతీయ పోటీల్లో తమ అకాడమీ డ్యాన్సర్ ప్రతిభ కనబరిచి మూడోస్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

లైంగికదాడిపై కేసు నమోదు

మెంటాడ: మండలంలోని కుంటినవలస గ్రామానికి చెందిన మాదిరెడ్డి అప్పారావు(38) తనపై లైంగికదాడికి పాల్పడ్డాడంటూ అదే గ్రామానికి చెందిన వివాహిత (48) ఫిర్యాదు చేసిందని ఆండ్ర ఎస్సై సిద్ధార్థ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని తన కళ్లంలో ఉన్న గేదెలకు పాలు తీయమని మాదిరెడ్డి అప్పారావును కోరడంతో సాయం చేశాడని అయితే తనను బలవంతంగా శాలలోకి లాక్కుని వెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఫిర్యాదు అందుకున్న తాము గ్రామానికి వెళ్లి సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామని చెప్పారు. సీఐ అప్పలనాయుడు ఈకేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

జేఎన్‌టీయూ జీవీలో ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన


పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలోని డాక్టర్ వైఎస్ఆర్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన పుస్తకప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. విశాఖ జ్యోతి బుక్ డిపో సంయుక్త నిర్వహణలో దాదాపు 2,200 పుస్తకాలు ఈ ప్రదర్శనలో ఉంచారు. ఇందులో ఇంజినీరింగ్ పుస్తకాలు 500 వాల్యూమ్‌లు, జనరల్ బుక్స్ 1,200 వాల్యూమ్‌లు, కాంపిటేటివ్ బుక్స్ 500 వాల్యూమ్స్ ప్రదర్శించారు. తొలుత ప్రదర్శనను ప్రారంభించిన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శన ద్వారా పుస్తకపఠనం అలవర్చుకోవడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.గురునాథ, ఆఫీసర్ ఇన్‌చార్జ్ లైబ్రరీ డాక్టర్ సి.నీలిమాదేవి, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ పద్మజ, డాక్టర్ నళిని, అసిస్టెంట్ లైబ్రేరియన్ జి.ఈశ్వరరావు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్ట పర్యవేక్షణలో ప్రాథమిక విద్య

- విద్యాప్రమాణాలపై పక్క మండల అధికారులతో తనిఖీ
- మండలంలో రోజుకు రెండు ప్రాథమిక పాఠశాలల పరిశీలన


గుర్ల మండలంలోని శేషుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం అర్బన్: ఉన్నత పాఠశాలల్లో ఫలితాలు మెరుగుపడాలంటే ప్రాథమిక విద్య నుంచి బోధనలో నాణ్యత పెరగాలని జిల్లా విద్యాశాఖ గుర్తించింది. అందుకోసం ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై పర్యవేక్షణ శైలిని మార్చింది. ఉపాధ్యాయుల బోధన సామర్థ్యం మరింత సమర్థవంతంగా ఉండాలని, ఆ దిశగా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధన నిర్వహణపై పర్యవేక్షణ పటిష్టత పెంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న మండల స్థాయి విద్యాశాఖ అధికారుల తనిఖీలకు బదులుగా కొత్త విధానాన్ని ప్రారంభించింది. సమీప మండల విద్యాశాఖ అధికారి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బృందంగా తనిఖీల పద్ధతిని జిల్లా విద్యాశాఖ అమలులోకి తెచ్చింది. ప్రతి మండలంలోనూ రోజుకు రెండు ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తారు. జిల్లా విద్యాశాఖ ఒక రోజు ముందు ఎంపిక చేసిన ఆ రెండు స్కూళ్లకు బృందాలు తనిఖీకి వెళ్తాయి. తనిఖీలు చేయాల్సిన అకడమిక్ అంశాలను ఫార్మాట్ రూపంలో నిర్దేశించారు. తరగతి సిలబస్ సకాలంలో పూర్తి చేస్తున్నదీ లేనిదీ, విద్యార్థి నోట్స్ బుక్ నిర్వహణ, వర్క్ బుక్‌లోని ప్రాక్టీస్ ప్రశ్నలపై విద్యార్థుల అవగాహన, విద్యార్థికి ఉన్న చదవడం, రాయడం సామర్థ్యాల పరిశీలన వంటి వాటిపై తనిఖీలో సమగ్రంగా పరిశీలించి నివేదిక తయారుచేయాలి. మరుసటి రోజున ఆ నివేదికను జిల్లాస్థాయి అధికారుల బృందం పరిశీలించాక ప్రమాణాలు లేని పాఠశాలల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటారు. తొలుత షోకాజ్ నోటీస్ ఇచ్చి వారి వివరణ సంతృప్తిగా లేకపోతే ఇంక్రిమెంట్‌లో కోత ఉంటుంది. జిల్లా విద్యాశాఖ ఈ తనిఖీ విధానాన్ని గురువారం జిల్లాలోని 17 మండలాలల్లోనూ ప్రారంభించింది. తనిఖీ బృందం ఉపాధ్యాయుల ప్రలోభాలకు అవకాశం లేకుండా బృందాల తనిఖీపై డీఈఓ ఆకస్మిక తనిఖీ ఉంటుంది. జిల్లాలోని 1,804 ప్రభుత్వ పాఠశాలల్లో 1,344 ప్రాథమిక పాఠశాలున్నాయి. వాటిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు 4,409 మంది విధులు నిర్వహిస్తున్నారు.

బోధన సామర్థ్యం లేని టీచర్లకు షోకాజ్ నోటీసులు

బోధన సామర్థ్యాలు ప్రదర్శించని ఉపాధ్యాయులపై చర్యలు తప్పవు. ఇటీవల జిల్లాలో చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో పలువురు ఉపాధ్యాయులను గుర్తించి వారికి నోటీసులు ఇచ్చాం. వారిచ్చే వివరణలు పరిశీలనలో ఉన్నాయి. బాగోకపోతే ఇంక్రిమెంట్‌లో కోత విధిస్తాం. తాజాగా ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీల విధానాన్ని మార్చాం. సమీప మండలాల విద్యాశాఖ అధికారులతో తనిఖీలు చేపట్టే విధానాన్ని ప్రారంభించాం. జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన రెండు పాఠశాలలను ఆ రోజుకు తనిఖీ చేయాలి. తనిఖీలను గుర్తించి విద్యార్థి ప్రగతి నివేదికను సమీక్షిస్తాం. బోధన సామర్థ్యాలు బాగోకపోతే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మెరుగుపరచాలి

గుర్ల: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఈఓ లింగేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు గురువారం నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. కొంతమంది విద్యార్థులకు చదవడం, రాయడం కూడా రావడం లేదని అలాంటి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

నాడు నేడుపై సమీక్ష

అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో జరుగుతున్న నాడు -నేడు పనులపై డీఈఓ లింగేశ్వరరెడ్డి పాఠశాల హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 761 అంగన్‌వాడీ కేంద్రాలకు 4రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఆయా గ్రామాల పాఠశాలల హెచ్ఎంలు కమిటీ సభ్యులుగా వేశారని, వారి ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాల పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఎస్ఏ ఏఓ గోపీచంద్, ఎంఈఓ ఎస్.భానుప్రకాశ్, ఐసీడీఎస్ సీడీపీఓ ఆరుద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి రాయబారి అమ్మ

- కొండవీటి జ్యోతిర్మయి


వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవుడమ్మతో కిరణ్మయి

మెంటాడ(గజపతినగరం రూరల్): కలియుగం దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి రాయబారిగా మరుపల్లి శివారు ప్రాంతంలో వెలసిన దేవుడమ్మ (పద్మావతి)ను చెప్పుకోవచ్చని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ గాయని కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె మరుపల్లి శివారు ప్రాంతంలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి విలేకరులతో మాట్లాడారు. గత 60 ఏళ్లుగా ఈఆలయంలో స్వామివారిని నమ్ముకుని ఆహారాన్ని త్యజించి, ఒక్క కర్పూరం కలిపిన పానీయంతోనే జీవనాన్ని సాగిస్తూ స్వామివారి సన్నిధిలో గడుపుతున్న దేవుడమ్మ మహిమలు చెప్పనలవి కాదన్నారు. ఈ చుట్టు పక్కల గ్రామాల ప్రజలంతా సుభిక్షంగా సంతోషంగా జీవిస్తున్నారంటే ఆమె ఆశీస్సుల వల్లేనన్నారు. కోరిన కోర్కెలను తీర్చే సజీవ మూర్తి పద్మావతి అమ్మ అన్నారు. దేవుడమ్మ లాంటి ఉపాసకురాలు ఈప్రాంతంలో ఉందని సాధువుల ద్వారా విని రెండోసారి ఈప్రాంతంలో ఉన్న ఆమెను కుటుంబసమేతంగా దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని చెప్పారు. ఆలయ అభివృద్ధికి టీటీడీ వారితో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా చూస్తానని తెలిపారు.

సాయిరాం ఆలయ సందర్శన

సత్యసాయి 98వ జయంతి వేడుకల్లో భాగంగా మరుపల్లి గ్రామంలో ఉన్న ఆలయాన్ని కొండవీటి కిరణ్మయి సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి హారతి ఇచ్చి భక్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పాత్రో మాస్టారు. రాంబాబు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, పాట్నూరు శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి?


గంట వేణు (ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన గంట వేణు (22) గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. నాగావళి నది కుడి కాలువ వద్దకు స్నానానికి వెళ్లిన సమయంలో, కాలువను ఆనుకుని ఉన్న ప్రాంతంలో ఏబీ స్విచ్ పడి ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించి, విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు చెబుతున్నారు. ఈ మేరకు స్థానిక ఎస్సై ఎం.రాజేష్, విద్యుత్‌శాఖ ఏఈ బి.శంకరరావులకు ప్రమాదంపై స్థానికులు సమాచారాన్ని అందించగా, సంఘటనా స్థలానికి వారు చేరుకున్నారు. విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడా? పాము కాటు తదితర కారణాలు ఏవైనా ఉన్నాయా అన్న కోణంలో దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతుడి తండ్రి సూరపునాయుడు కొద్ది నెలల క్రితం మృతిచెందగా తల్లి సావిత్రమ్మ, అన్నయ్య శేఖర్ ఉన్నారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కుమరాం గ్రామంలో జరిగిన గొడవల నేపథ్యంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపారు. గ్రామానికి చెందిన దీనుపల్లి శివ భార్య సీతమ్మలు తమ దంపతులపై దాడి చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన రఘుమండ సత్యంనాయుడు, అతని సోదరుడు రఘుమండ సూరినాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు,మరో ముగ్గురిపై సాధారణ కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా గ్రామ వలంటీరు ఉప్పాడ రామప్పడు భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు దీనుపల్లి శివ కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామని వివరించారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాన్యులకు రాజ్యాధికారం

- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పక్కన ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, కంబాల జోగులు

బొబ్బిలి/రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సామాన్య కార్యకర్తలుగా ఉన్న మా లాంటి సామాన్యులకు రాజ్యాధికారం దక్కిందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బొబ్బిలిలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రలో భాగంగా డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో కలిసి రామభద్రపురం మండల పార్టీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో వెనుకబడిన వర్గాలకు చెందిన ధర్మాన ప్రసాదరావు, బూడి ముత్యాలునాయుడు, తమ్మినేని సీతారాంతో పాటు మా లాంటి వారికి ఉన్నతమైన పదవులు దక్కాయన్నారు. అల్లూరి సీతారామరాజు, జ్యోతిరావుపూలే, అంబేడ్కర్ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. విశాఖపట్నంను పరిపాలనా రాజధానిగా ప్రకటించి ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాటలు వేశారన్నారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసి ప్రపంచ పటంలో విజయనగరానికి అరుదైన గుర్తింపునిచ్చారన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల, జేఎన్‌టీయూ జీవీ వర్సిటీ, గిరిజన యూనివర్సిటీ, పార్వతీ పురం మన్యం జిల్లా కురుపాంలో ట్రైబల్ ఇంజినీరింగ్ కళాశాల వంటి విద్యా సంస్థలను నెలకొల్పి ఉమ్మడి విజయనగరానికి కొత్త వైభవాన్ని తెచ్చారన్నారు. గత ప్రభుత్వం బీసీలను పూర్తిగా విస్మరించిందని, ఒక్కశాతం ఓటు బ్యాంకు ఉన్న క్షత్రి వర్గీయులను అందలమెక్కించడం కోసం ఓ బీసీ మహిళను మంత్రి పదవి నుంచి తప్పించిందన్నారు. ప్రజలను మోసం చేసి పార్టీలు మారిన బొబ్బిలి రాజుకు మంత్రి పదవి కట్టబెట్టిందని విమర్శించారు.

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మాట్లాడుతూ జగన్ పాలనలోనే బడుగు, బలహీన వర్గాలు ఆర్థికాభ్యున్నతి సాధించాయన్నారు. రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 12 కోట్ల 66 లక్షల మందికి ప్రభుత్వం సామాజిక న్యాయం చేసిందన్నారు. బీసీ వర్గాలకు వివిధ సంక్షేమ పథకాల కింద లక్షా 60వేల కోట్లు, దళిత వర్గాలకు రూ.60 వేల కోట్ల ఆర్థిక సహకారం అందించిందని తెలిపారు. ఇటు వంటి సుపరిపాలన అందించిన ప్రభుత్వం భారత దేశంలోనే ఎక్కడా లేదన్నారు.
- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గంలో ఎన్నడూ చూడని విధంగా సామాజిక, సంక్షేమ అభివృద్ధి జరిగిందన్నారు. మారుమూల గామాల్లోనూ బీటీ రోడ్లు వేశామని తెలిపారు. గత ప్రభుత్వంలో మంత్రి పదవిలో ఉన్న రాజులు శిలాఫలకాలు వేసి వదిలేసిన రోడ్లను సైతం నిర్మించామని చెప్పారు.
- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సచివాలయాలను ఏర్పాటు చేసి రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. విజయనగరంలో రూ.500 కోట్లతో వైద్య కళాశాల, రూ.4,500 కోట్లతో భోగపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుచేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, డీసీఎంఎస్ చైర్మన్ భావన, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు నష్టపరిహారం పంపిణీ


అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం అందచేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు

పూసపాటిరేగ: విశాఖలో జరిగిన ఫిషింగ్ హార్బర్ బోటు అగ్నిప్రమాదంలో బాధిత మత్స్యకార కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నష్ట పరిహారం పంపిణీ చేసినట్లు వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం విశాఖపట్నంలోని జిల్లాపరిషత్‌లో 49 మంది బాధిత మత్సకార కుటుంబాలకు రూ.7 కోట్ల 11 లక్షల 76 వేలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భోగాపురం, పూసపాటిరేగలకు చెందిన బాధిత కుటుంబాల వారు పరిహారం అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవనోపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు అండగా నిలిచి పరిహారం తక్షణమే మంజూరు చేయించారని సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నారు



విశాఖ ఫిషింగ్‌హార్బర్ అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవడం సంతోషదాయకం. ప్రమాదం జరిగిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. ప్రమాదంలో అగ్నికి ఆహుతైన మా బోటుకు రూ.16 లక్షల పరిహారం వచ్చింది. జీవనోపాధి పోయిందని బాధపడుతున్న సమయంలో దేవుడిలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాపాడారు.

బొడ్డు ఎల్లాజీ, అగ్నిప్రమాద బాధితుడు కోనాడ

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. ఫిషింగ్ హార్బర్ బోటు అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు పెద్ద దిక్కుగా నిలిచారు. మాకు రూ.16 లక్షల పరిహారం అందచేశారు. జీవనోపాధి కోల్పోయిన కుటుంబాలకు జీవితం ఇచ్చారు.

గనగళ్ల నరసింహులు, బాధితుడు, చేపలకంచేరు

రామతీర్థం దేవస్థానానికి పోటెత్తిన భక్తులు


రామతీర్థంలోని ఉమా సదాశివాలయంలో భక్తుల రద్దీ


కొత్తపేట సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక వ్రతం

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానానికి గురువారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం తొలి ఏకాదశి కావడంతో రామాలయంతో పాటు శివాలయంలో భక్తుల రద్దీ కనిపించింది. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉమా సదాశివాలయంలో శివుడికి పంచామృత ద్రవ్యాలతో విశేష అభిషేకాలు జరిపించారు. కొత్తపేట గ్రామంలో ఉన్న సత్యనారాయణ స్వామి ఆలయం, బూరాడపేటలో బాలా త్రిపుర సుందరి దేవి, జోగిరాజుపేటలో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి.

ఆలయాల అభివృద్ధికి కృషిచేయాలి

- దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ


మరిచర్ల జగదీశ్వరి


ఎం.వంశీ లక్ష్మి


తెల్లి రమేష్

విజయనగరం టౌన్: జిల్లాలో బాధ్యతలు అప్పగించిన కార్యనిర్వహణాధికారులు ఆయా ఆలయాల అభివృద్ధికి కృషిచేయాలని దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఇటీవల శిక్షణ పూర్తిచేసుకున్న ముగ్గురు గ్రేడ్-3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లకు దేవాలయాల ఈఓలుగా గురువారం బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈఓలుగా తెల్లి రమేష్‌కు సాలూరు గ్రూప్-1, 2 ఆలయాలు, ఎం.వంశీ లక్ష్మికి శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయం, మరిచర్ల జగదీశ్వరి శ్రీ విమర్శప్రకాశ విశ్వేశ్వరస్వామి ఆలయానికి బాధ్యతలు చేపట్టారన్నారు. బాధ్యతాయుతంగా పనిచేసి, దేవాదాయశాఖకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

డీసీఎంఎస్ బలోపేతానికి కృషి

- డీసీఎంఎస్ చైర్‌పర్సన్ భావన


మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన

రామభద్రపురం: డీసీఎంఎస్ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం ఆమె మాట్లాడుతూ డీసీఎంఎస్ ఆధ్వర్యంలో రూ.20 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని డీసీఎంఎస్‌లలో విజయనగరం 5వ స్థానంలో ఉందని, రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 100 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేశామని చెప్పారు. రైతుల వద్ద సేంద్రియ బెల్లం కొనుగోలు చేసి విక్రయాలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని డిజిటల్ తరగతి గదులలో మౌలిక సదుపాయాల కల్పిస్తున్నామని వివరించారు. సేంద్రియ వ్యవసాయం, మిల్లెట్స్ సేద్యంపై అవగాహన కోసం వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామభద్రపురం పీఏసీఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, అవనాపు విక్రమ్ పాల్గొన్నారు.

26న రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవాలి

విజయనగరం అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం జరపాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లా అధికారులు తమ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరపడంతోపాటు తమ పరిధిలోని క్షేత్రస్థాయి కార్యాలయాల్లోనూ ఆ రోజు ఉదయం 11 గంటలకు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఒక సర్క్యులర్ జారీ చేశారు. ఆయా కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ పీఠికను చదివి వినిపించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని ప్రభుత్వ శాఖల అధికారులు, వారి సిబ్బంది ఉదయం 10.30 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹85	₹140	₹150